క్లుప్తంగా

ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి

పుల్లలచెరువు: మండలంలోని పలు సచివాలయాల పరిధిలో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 0–5 ఏళ్ల వయసు చిన్నారులకు ఆధార్ ఐడీ లేని వారి కోసం ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశారని, గ్రామ ప్రజలకు, పాఠశాల విద్యార్థులకు సంబంధిత సచివాలయాల పరిధిలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 24వ తేదీ నాయుడుపాలెం, రాచకొండ, 25న ఐటీ వరం, గారపెంట, 27న మర్రివేముల, ముటుకుల గ్రామ సచివాలయాల పరిధిలో ఆధార్ క్యాంపులు జరుగుతాయని, గ్రామాల్లోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుకు యూనిక్ ఐడీ తప్పనిసరి

యర్రగొండపాలెం: పట్టాదారు పాస్ బుక్ ఉన్న ప్రతి రైతు 11 అంకెల యూనిక్ ఐడీ నమోదు చేసుకోవడం తప్పనిసరి అని మండల వ్యవసాయాధికారి కె.వి.శేషారెడ్డి అన్నారు. మండలంలోని అమానిగుడిపాడు, గుర్రపుశాల గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో భూ ఆధార్ రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ ఆధారిత గుర్తింపు కార్డు ఉన్న రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని అన్నారు. రైతులు ఆయా ప్రాంతాల్లోని రైతు సేవా కేంద్రాల వద్దకు తమ పాస్ బుక్, ఆధార్‌కార్డు, ఆధార్ కార్డు లింక్ ఉన్న ఫోన్ నంబర్లను తీసుకొని వెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవో మాల్యాద్రిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి.రామారావు నాయక్ పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

దర్శి(కురిచేడు): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశ పరీక్షలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ మాధవరావు తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. ఏప్రిల్ 6న ప్రవేశ పరీక్ష జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు గురుకుల పాఠశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

ప్రకృతి సేద్యంతో ఆరోగ్యం పదిలం

మార్టూరు: ప్రకృతిలో లభించే సహజ సిద్ధమైన వనరులతో పండించిన ప్రకృతి సేద్యపు పంటల ద్వారా మెరుగైన ఆరోగ్యంతో పాటు దీర్ఘ ఆయుష్షును పెంచుకోవచ్చని జీరో బడ్జెట్ నేచురల్ ఫార్మింగ్ మార్టూరు మండల అధికారి రాజశేఖర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం మండలంలో పండించిన ప్రకృతి సేద్యపు కూరగాయల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. సోమవారం మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద కూరగాయలు, ఆకు కూరలు విక్రయించునున్నట్లు ఆయన తెలిపారు. ప్రకృతి సేద్యపు సిబ్బంది శివ శంకర్, నాగరాజు,తన్నీరు శ్రీనివాస రావు, రాజీ, వైష్ణవి, రెహమూన్ బీ, తదితరులు పాల్గొన్నారు.

శివభక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ



వాటర్ ట్యాంకర్ వద్ద రెడ్డి సంక్షేమ సంఘ నాయకులు

మార్కాపురం టౌన్: మార్కాపురం రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే శివభక్తులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేయడంతో పాటు వాటర్ ట్యాంకర్‌ను కూడా సిద్ధం చేసినట్లు సంఘ అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి తెలిపారు. రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు ఎం.శ్రీనివాసరెడ్డి, సీహెచ్ సత్యనారాయణరెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ ఎస్ అశోక్‌రెడ్డి, ఎం.వెంకటరెడ్డితోపాటు పలువురు సహకరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు టి.రామిరెడ్డి, కె.రమణారెడ్డి, కేవీ నరసింహారెడ్డి, జి.భాస్కర్‌రెడ్డి, డి.వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.





గ్రామంలోని తారురోడ్డు

ఆగిన బిల్లులు.. నిలిచిన రోడ్డు నిర్మాణం

- నెలలు గడుస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం

కురిచేడు:

మండలంలోని పొట్లపాడు రైల్వేస్టేషన్ నుంచి దర్శి మండలం తుమ్మెదలపాడు గ్రామం వరకు రూ.9 కోట్లతో రోడ్డు మంజూరైంది. గంగదానకొండ, పడమర గంగవరం, రెడ్డెన్నపల్లి గ్రామాల గుండా రోడ్డును మూడు నెలల క్రితం తారు రోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. గ్రామాల పరిధిలో సిమెంట్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది. కొంత మేర పనులు నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల పరిధిలో రోడ్డు నిర్మించకపోవటంతో రోడ్డంతా గుంతల మయమై వృద్ధులు, మహిళలు రాత్రిళ్లు నడవాలంటే ఇబ్బందులు పడుతున్నారు. ఈరోడ్డు నిర్మాణంతో కురిచేడు–దర్శి మండలాలకు వెళ్లేందుకు ఆయా గ్రామాలప్రజలకు అనుకూలంగా ఉంటుంది. ఎన్నో ఏళ్ల తరబడి ఆశించిన రోడ్డు మంజూరు కావటంతో ఆశించిన ప్రజలకు రోడ్డు నిర్మాణ పనులు నిరాశను మిగిల్చాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని రోడ్డు నిర్మాణం పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డునిర్మాణ పనులు నిలిచిపోవటంపై ఆర్‌అండ్‌బీ ఏఈ మంజూష ను వివరణ కోరగా మొదట చేసిన పనికి రెండు బిల్లులు పంపామని, వాటికి నిధులు రాలేదని, అందువల్ల పనులు ఆగిపోయినట్లు తెలిపారు. ఒక బిల్లుకు సంబంధించిన నిధులు వచ్చినా వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు. అంతే గాకుండా గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి కొంతమేర ఆక్రమణలను తొలగించాల్సి ఉందని తెలిపారు.

వైపాలెం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా శైలేంద్రకుమార్

యర్రగొండపాలెం: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా పెద్దారవీడు మండలం తహసీల్దార్ శైలేంద్రకుమార్‌ను నియమిస్తూ కలెక్టర్ తమీమ్ అన్సారియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఉన్న తహసీల్దార్ బాల శౌరి రూ.కోట్లు విలువ చేసే రోడ్లు, భవనాల శాఖకు చెందిన స్థలంతోపాటు 58, 58/1 ఇతరుల పేరుతో గిఫ్ట్ డీడ్‌తో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు సహకరించినందుకు ఆయనను సస్పెండ్ చేశారు. కొన్ని రోజులుగా డీటీ మల్లికార్జున నాయుడు తహసీల్దార్ విధులను నిర్వర్తిస్తూ వచ్చారు. ఆయనపై కూడా పలువురు ఫిర్యాదు చేయడంతో ఆ స్థానంలో శైలేంద్రకుమార్‌ను ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు.

పీఎం కిసాన్‌కు 7738 మంది అర్హులు

పుల్లలచెరువు: పీఎం కిసాన్ పథకానికి మండలంలోని 7738 మంది రైతులు అర్హత కలిగిన్నారని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి తెలిపారు. ఆమె సోమవారం ప్రకటనలో తెలియచేస్తూ ప్రధానమంత్రి మోదీ విడుదల చేసిన పీఎం కిసాన్ 19వ విడతకు మండలంలోని అన్ని గ్రామాల్లో కలుపుకుని 7738 మంది రైతులకు రూ.1.55 కోట్ల నగదు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమచేసినట్లు చెప్పారు.

శ్రీశైలం తరలి వెళ్లే భక్తులకు సేవా కార్యక్రమాలు

- అటవీశాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన డిప్యూటీ డైరక్టర్



మంచినీటి చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ డైరక్టర్

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం తరలి వచ్చే భక్తుల సౌకర్యార్థం స్వచ్ఛంద సేవా సంస్థలతో పాటు అటవీశాఖ అధికారులు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గణపతి చెక్‌పోస్టు వద్ద అటవీశాఖ ఆధ్వర్యంలో ఉచిత మంచి నీటి చలివేంద్రాన్ని డిప్యూటీ డైరక్టర్ సందీప్ కృపాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో 3 నెలల పాటు చలివేంద్రాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రేంజి అధికారి జీవన్‌కుమార్ బీట్ ఆఫీసర్ బాబు తదితరులు పాల్గొన్నారు. దీంతో పాటు నల్లమల అభయారణ్యంలో ఇస్కాన్ ఆధ్వర్యంలో పెచ్చెరువు, తామర్లగుంట తదితర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలతో పాటు, వైద్య సేవలు, భీముని కొలను వద్ద గ్లూకోస్ వాటర్ కేంద్రాలను ప్రారంభించినట్లు అమల నిమయ్‌దాస్ తెలిపారు.

6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ముండ్లమూరు(కురిచేడు): స్థానిక మోడల్ పాఠశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి మార్చి 31వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఏపీఎంఎస్.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసే విద్యార్థులు ఓసీ, బీసీ విద్యార్థులు 2013 సెప్టెంబర్ నుంచి 2015 ఆగస్టు మధ్య జన్మించి ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 అక్టోబర్ నుంచి 2015 ఆగస్టు మధ్య జన్మించి ఉండాలన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో ఐదవ తరగతి చదువుతూ ప్రమోషన్ అర్హత ఉంది ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు 5వ తరగతి స్థాయిలో ఏప్రిల్ 20వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక మోడల్‌పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

దేశ చరిత్రను కాపాడాల్సిన బాధ్యత అందరిదీ



మాట్లాడుతున్న తహసీల్దార్ ఆంజనేయరెడ్డి

గిద్దలూరు రూరల్: దేశ చరిత్రను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్థానిక తహశీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 178వ వర్ధంతిని పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. దేశం కోసం పోరాడి ప్రాణత్యాగాలు చేసిన మహనీయులను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. మహనీయుల బాటలో నడవాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బీఎస్ నారాయణరెడ్డి, విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు రవీంద్రారెడ్డి, మార్కాపురం రాంభూపాల్ రెడ్డి, బీజేపీ నాయకులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్, డాక్టర్ జేవీ నారాయణ, హెల్త్ అధికారి హబీబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వం మద్దతు ధర రూ.7,500 చొప్పున కొనుగోలు చేస్తుందన్నారు. మండలంలోని తూర్పు గంగవరంలో నాగంబొట్ల పాలెం సొసైటీ పీఏసీఎస్ పరిధిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులు వద్ద నుంచి మాత్రమే మద్దతు ధరపై కొనుగోలు చేస్తారని, చిన్న సన్నకారు రైతులకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. నిర్దేశిత నాణ్యత ప్రమాణాలు కలిగిన కందులు మాత్రమే కొనుగోలు చేస్తారని,, రైతు బ్యాంకు ఖాతాలకు వెంటనే నగదు జమవుతుందని పేర్కొన్నారు. రైతులు రైతు సేవా కేంద్రాల్లో కందుల రిజిస్ట్రేషన్ చేయించుకొని వాటిని సొసైటీ ద్వారా అమ్ముకునే వీలుంటుందని, ప్రభుత్వ మద్దతు ధర కంటే మార్కెట్లో రేటు అధికంగా ఉంటే ఓపెన్ మార్కెట్లో అమ్ముకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు, టెక్నికల్ ఏఓ శ్రీనివాస్ నాయక్, సొసైటీ సీఈఓ ఎస్ శ్రీనివాసరెడ్డి, వీఏఏ వెంకట కుసుమ, రైతులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

కంభం: అక్రమ మద్యం కలిగి ఉన్న బెల్టుషాపు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కొండారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక బస్టాండ్ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా బేస్తవారిపేట మండలం సలకలవీడుకు చెందిన వెంకటరత్నం 10 మద్యం సీసాలతో పట్టుబడ్డాడని చెప్పారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని మద్యం సీజ్ చేశామన్నారు.

హుండీ ఆదాయం రూ.5,81,569



కానుకలు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

తాళ్లూరు: మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవరపాడు గ్రామ పరిధిలో ఉన్న ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుంటి గంగాభవానీ దేవస్థానం హుండీని సోమవారం లెక్కించారు. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ జి.అనంత సత్యనారాయణ ఆధ్వర్యంలో 166 రోజులకు గాను హుండీని లెక్కించగా రూ.5,81,569 ఆదాయం వచ్చింది. కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ కె.గురుబ్రహ్మం, ఈఓ గుంటుపల్లి వాసు, అర్చకులు విజయలక్ష్మి, బాలరాజు, కామేశ్వరశర్మ, బృంది తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరా.. పరమేశ్వరా..

- మహా శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు

మార్కాపురం/కంభం/బేస్తవారిపేట: శివుడు సర్వంతర్యామి. మనసారా ఓం నమఃశివాయ అంటే సర్వ పాపాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అభిషేక ప్రియుడు, భోళా శంకరుడిగా పేరొందిన మహాశివుడిని దేవతలతోపాటు రాక్షసులు పూజించినట్లు పురాణాలు చెబుతున్నాయి. బుధవారం మహాశివరాత్రి పర్వదినం. ఈ సందర్భంగా మార్కాపురం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని శివాలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి.

మార్కండేయ ఆలయంలో..

మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఆలయంలోని శివలింగం స్వయంగా మార్కండేయ మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. శ్రీకృష్ణ దేవరాయలు కాలంలో జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి దేవాలయాన్ని అభివృద్ధి చేసినట్లు శాసనాలు వెల్లడిస్తున్నాయి. మహాశివరాత్రి సందర్భంగా ఈనెల 24 నుంచి మార్చి 5వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. 25న ధ్వజారోహనం 26శ తేదీ రాత్రి ఎదుర్కోలు, గ్రామోత్సవం, తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారి కల్యాణం నిర్వహించనున్నారు. 27న సాయంత్రం 6.30 గంటలకు నంది వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. 28న గజోత్సవంపై సార్వభౌమ అలంకారం, మార్చి 1న రావాణసుర వాహనంపై నటరాజ శివతాండవం, 2న భృంగీశ్వర వాహనంపై జటాఝూట మహేశ్వర, 3న సాయంత్రం 5గంటలకు రథోత్సవం, 4న శివపార్వతుల అలంకారం, పూర్ణాహుతి సందర్భంగా మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం, 5న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ వివరించారు.



కంభం : గుండ్లకమ్మ ఒడ్డున సురభేశ్వర స్వామి ఆలయం



మార్కాపురంలోని మార్కండేశ్వర స్వామి

- వేములకోట శివాలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు దామసాని వెంకట్రామయ్య తెలిపారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తామన్నారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. తిప్పాయపాలెంలోని మునీశ్వరస్వామి ఆలయంలో కూడా శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

కనక సురభేశ్వరస్వామి ఆలయంలో..

కంభం మండలంలోని తురిమెళ్ల సమీపంలో కనక సురభేశ్వరస్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. నల్లమల అడవిలో గుండ్లకమ్మ ఒడ్డున ఉన్న ఈ ఆలయాన్ని 1440లో శ్రీకృష్ణదేవరాయలు పూర్వీకులు నిర్మించినట్లు శాసనాలు వెల్లడిస్తున్నాయి. ఈ ఆలయంలో ఏటా మహా శివరాత్రి ఉత్సవాలను (కోన తిరునాళ్ల) మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. అభిషేకాలు, ధ్వజారోహణం, స్వామి వారి కళ్యాణోత్సవం, నంది వాహనంపై స్వామి వారి ఊరేగింపు ఇక్కడి ప్రత్యేకత. ఉత్సావాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వస్తుంటారు. ఈ నేపథ్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. శివరాత్రి రోజున అభిషేకాలు, హోమాలు, 27వ తేదీన హోమాలు, గోగులదిన్నె వారితో నంది వాహన ఉత్సవం, కోలాటం, 28వ తేదీన నెమలి వాహన ఉత్సవం, ప్రత్యేక పూజా కారక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ ధర్మకర్త గోగులదిన్నె వెంగళరెడ్డి వివరించారు.

ముక్తేశ్వర ఆలయంలో..

బేస్తవారిపేట మండలంలోని ముక్తేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక్కడి శివలింగాన్ని వశిష్ట మహర్షి ప్రతిష్ఠించినట్లు పురాణాలు చెబుతున్నాయి. ఆలయ ధ్వజస్తంభం దిగువన ఉన్న పుష్కరిణిని శాలివాహన శకం 1524 అంటే క్రీ.శ 1602లో నిర్మించినట్లు శిలా శాసనంలో పేర్కొన్నారు. పందిళ్లపల్లి, మోక్షగుండం గ్రామాల సమీపంలోని కొండల నడుమ కొలువైన ఈ ఆలయంలో మొత్తం ఐదు కోనేర్లు ఉన్నాయి. సంతానలేమితో బాధపడే దంపతులు ఇక్కడ శివుడిని పూజిస్తే సంతానప్రాప్తి కలుగుతుందని భక్తుల విశ్వాసం. ఏటా ముక్తేశ్వరం కోన తిరునాళ్లకు వేలాదిగా భక్తులు తరలివచ్చి శివయ్యను దర్శించుకుంటారు.

నాలుగేళ్లుగా బాగున్నాం.. నాశనం చేయొద్దు

- కూటమి హామీ ప్రకారం మెరుగైన వేతనమివ్వలేదు
- ఆప్కాస్ రద్దు చేసి ప్రైవేట్‌కు అప్పగిస్తే కార్మికులకు నిత్య కష్టాలే..
- మార్కాపురం, పొదిలిలో మున్సిపల్ కార్మికుల ఆందోళన



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు



పొదిలిలో కార్మికులకు పోస్టు కార్డులు అందజేస్తున్న రమేష్

మార్కాపురం టౌన్: ఆప్కాస్‌ను రద్దు చేయాలనే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు ఎస్కే ఖాశీం డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు పారిశుధ్య కార్మికులు నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకోకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, అన్ని రకాల సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు.

సమస్యలపై సీఎంకు పోస్టు కార్డులు

పొదిలి: మున్సిపల్ కార్మికులను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పొదిలిలో మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. సమస్యలను తెలుపుతూ పోస్టు కార్డులను సీఎం కార్యాలయానికి పోస్టు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. ఆప్కాస్ మూలంగా గత నాలుగేళ్లుగా కార్మికులు ఊపిరి పీల్చుకున్నారన్నారు. దళారీలు లేరు, ప్రతినెలా ఒకటి లేదా రెండో తేదీల్లో వేతనం ఖాతాల్లో జమ అయిందని పేర్కొన్నారు. పీఎఫ్, ఈఎస్ఐలో కార్మికుల వాటాలు జమవుతూ వస్తోందని, ఎలాంటి బెదిరింపులు కూడా లేవన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే మెరుగైన వేతనం ఇస్తామని నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి కష్టాల్లోకి నెట్టాలని చూడటం దారుణమన్నారు. కార్మికుల సంక్షేమానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగిస్తే ఇకపై నిత్యం పోరాటాలు చేయాల్సి వస్తుందన్నారు. నగర పంచాయతీ కార్మిక యూనియన్ కార్యదర్శి బి.కోటేశ్వరమ్మ మాట్లాడుతూ.. అసలే సమస్యలు పరిష్కారం కాక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే, ఆప్కాస్‌ను రద్దు చేస్తున్నట్లు లీకులివ్వడం సరికాదన్నారు. చిన్న బస్టాండ్ నుంచి పెద్ద బస్టాండ్, రథం రోడ్డు మీదుగా పోస్టాఫీసు వరకు కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నరసింహం, వి.నాగేశ్వరరావు, పి.నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలి

గిద్దలూరు రూరల్: పారిశుధ్య కార్మికులను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. ఆప్కాస్ రద్దును నిరసిస్తూ సోమవారం పట్టణంలోని పెద్ద పోస్టాఫీసు కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రికి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆవులయ్య మాట్లాడుతూ.. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలను అప్పగించడం సరికాదన్నారు. కార్మికులకు అన్యాయం చేసే విధానాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్మికులు నాగయ్య, రంగయ్య, బాలయ్య, చంటయ్య, పాపయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.